

పాలకొండలో చురుగ్గా ఏర్పాట్లు

పాలకొండ: శంఖారావం పేరిట ఈ నెల 13న తొలిసారిగా లోకేశ్ పాలకొండ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పాలకొండ-వీరఘట్టం రోడ్డులోని విశాలమైన ప్రాంగణంలో సభా వేదికను సిద్ధం చేశారు. సుమారు 15 వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. మరోవైపు పాలకొండ పట్టణమంతా పసుపుమయంగా మారింది. ఎటుచూసినా టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. లోకేశ్ పర్యటన విజయవంతానికి నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.



నేటి నుంచే శంఖారావం
సర్వం సిద్ధం

- జిల్లాలో పాలకొండ నుంచి ప్రారంభం కానున్న నారా లోకేశ్ యాత్ర
- రోజూ రెండు నియోజకవర్గాల్లో సభలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన టీడీపీ శ్రేణులు



పాలకొండలో ముస్తాబవుతున్న సభా ప్రాంగణం

పార్వతీపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టనున్న 'శంఖారావం' యాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా టీడీపీ శ్రేణులు సర్వం సిద్ధం చేశాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి పాలకొండలో లోకేశ్ యాత్ర ప్రారంభం కానుంది. బుధవారం రాత్రి సాలూరులో నిర్వహించనున్న సభతో పర్యటన ముగియనుంది. అయితే జిల్లా ఆవిర్భావం తర్వాత తొలిసారిగా లోకేశ్ 'మన్యం'కు వస్తుండడంతో పార్టీ కార్యకర్తలు, నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభల విజయవంతానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. టీడీపీ శ్రేణులతో పాటు ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున సభలకు తరలివచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవంగా రాష్ట్రంలో 120 నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటించనున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర చేపట్టనున్నారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చాక కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను జిల్లా ప్రజలకు ఆయన వివరించనున్నారు. జిల్లాలో రోజూ రెండు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను వివరిస్తారు.

పర్యటన ఇలా..

శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో మంగళవారం యాత్ర పూర్తయిన తర్వాత మధ్యాహ్నంలో లోకేశ్ పాలకొండకు చేరుకుని శంఖారావం సభ నిర్వహించనున్నారు. సాయంత్రం కురుపాం నియోజకవర్గం గురుగుబిల్లి మండలం ఎర్రన్నగుడి వద్దకు చేరుకోనున్నారు. రాత్రి పార్వతీపురం చేరుకుని బస చేస్తారు. బుధవారం ఉదయం 10 గంటలకు పార్వతీపురం మండలం వెంకమ్మపేట వై.జంక్షన్ వద్ద సభ నిర్వహిస్తారు. ఆ తర్వాత సాలూరులో శంఖారావం సభ నిర్వహించనున్నారు.

షెడ్యూల్ ఇలా...

మంగళవారం మధ్యాహ్నం 2.36 గంటలకు పాలకొండ శంఖారావం సభలో లోకేశ్ ప్రసంగిస్తారు. 2.56 గంటలకు పార్టీ క్యాడర్‌తో ముఖాముఖి, 3.26 గంటలకు సూపర్-6 కిట్లు అందజేత, 3.28 గంటలకు ప్రతిజ్ఞ చేయించనున్నారు. 3.29 గంటలకు లోకేశ్‌తో సెల్ఫీ కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం 4.30 గంటలకు కురుపాం నియోజకవర్గానికి చేరుకుంటారు. 5.06 గంటలకు శంఖారావంలో లోకేశ్ ప్రసంగిస్తారు. 6.00 గంటలకు రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించి 6.30 గంటలకు పార్వతీపురం చేరుకుని బస చేస్తారు.

శ్రేణుల్లో జోష్

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీకి ప్రజల్లో ఆదరణ పెరగడం, శ్రీకాకుళం జిల్లాలో లోకేష్ శంఖారావం యాత్రకు విశేష స్పందన వస్తుండడంతో పార్టీ శ్రేణుల్లో నూతన జోష్ నెలకొంది. నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. 'మన్యం'లోనూ లోకేశ్ పర్యటనను విజయవంతం చేసేందుకు నియోజక వర్గాల ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు చర్యలు చేపడుతున్నారు.




పార్వతీపురం, పాలకొండలో సభా స్థలం పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

సిక్కోలులో నీరాజనం

- రెండోరోజూ సభలకు విశేష స్పందన

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి)

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపడుతున్న శంఖారావం యాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. తొలిరోజు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో సభలు విజయవంత మయ్యాయి. రెండో రోజు సోమవారం నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర నిర్వహించగా.. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనంటూ లోకేశ్ భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి తాను ప్రత్యేక బాధ్యత వహిస్తానంటూ స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టనున్న అభివృద్ధి పనులు, అమలు చేయనున్న పథకాల గురించి వివరిస్తూ ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ ఇచ్చారు. నరసన్నపేటలో లోకేశ్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో నదుల అనుసంధానానికి తట్టెడు మట్టి కూడా మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు వేయలేకపోయారని, టీడీపీ-జనసేన కార్యకర్తలు రాబోయే రెండు నెలలుపాటు ప్రజల్లోకి వెళ్లి వైసీపీ అరాచకాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. శ్రీకాకుళంలో మాట్లాడుతూ ఈ నియోజకవర్గానికి ధర్మాన ప్రసాదరావు ఎమ్మెల్యేగా, మంత్రిగానూ ఉన్నారని, ఆయన కుమారుడు ఇసుక దోపిడీ తప్ప.. నియోజకవర్గానికి చేసిందేమిటంటూ ప్రశ్నించారు. టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి గురించి శ్వేతపత్రం విడుదల చేయగలమన్నారు. వైసీపీ పాలనలో కనీసం రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేదని.. సావిత్రీపురం వద్ద 23 ఎకరాలను మంత్రి, ఆయన కుటుంబ సభ్యులు కొట్టేశారని ఆరోపించారు.

జయప్రదం చేయండి

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళా

పాలకొండ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న శంఖారావం సభను జయప్రదం చేయాలని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పాలకొండ విచ్చేశారు. పాలకొండ- వీరఘట్టం రోడ్డులో మంగళవారం లోకేశ్ నిర్వహించనున్న శంఖారావం సభా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూ.. అరాచక పాలన చేపడుతున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు శంఖారావం పేరుతో లోకేశ్ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారని తెలిపారు. అదే సమయంలో రానున్న ఎన్నికలకు టీడీపీ శ్రేణులను సంసిద్ధం చేస్తున్నారన్నారు. స్థానిక నాయకుల ద్వారా సమస్యలను తెలుసుకుని టీడీపీ అధికారంలోకి వచ్చాక వాటిని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నారని వెల్లడించారు. అన్ని వర్గాలకు న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. వైసీపీ సర్కారు అరాచక పాలనకు చరమ గీతం పాడేందుకు జనసేనతో కలిసి అంతా పని చేస్తున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ సర్కారు ఓటమి ఖాయమని, టీడీపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మాజీ మంత్రి శ్రావణ్, నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ, నాయకులు అప్పల నాయుడు, కృష్ణమూర్తి నాయుడు, రామి నాయుడు, సంతోష్‌కుమార్, నారాయణరావు, ఉదయ్‌భాస్కర్, జనసేన నాయకులు నిబ్రం, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనం ఢీకొని.. నేలకూలి..



ఇది భామినిలోని అలికాం-బత్తిలి రోడ్డు. అక్కడ అంబేడ్కర్ విగ్రహం ఎందుకిలా పడి ఉందనుకుంటున్నారా? సోమవారం ఓ భారీ వాహనం ఢీకొనడంతో ఇలా నేలకూలింది. ఇంతలో అంబేడ్కర్ యువజన యువ సంఘం సభ్యులు అక్కడకు చేరుకుని విషయం తెలుసుకున్నారు. వెంటనే వాహన డ్రైవర్‌తో మాట్లాడారు. నూతన విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరమ్మతులు చేయిస్తానని వాహనదారులు చెప్పినా వారు వినలేదు. నూతన విగ్రహం ఏర్పాటా.. లేక మరమ్మతులు చేయాలా ? అనే దానిపై ఇరవురి మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే ఈ మార్గంలో తరచూ ఏదో ఒక వాహనం అంబేడ్కర్ విగ్రహాన్ని ఢీకొనడం పరిపాటిగా మారింది. విశాఖ నుంచి ఒడిశా వైపు భారీ వాహనాలు వెళ్లడంతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- భామిని

'అప్రెంటీస్' జీవో కాపీల దహనం

- యూటీఎఫ్ నిరసన



జీవో కాపీలను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

బెలగాం, ఫిబ్రవరి 12 : ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశపెడుతూ వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రతులను యూటీఫ్ ఆధ్వర్యంలో టీచర్లు దహనం చేశారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులోని అంబే డ్కర్ విగ్రహం వద్ద ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అప్రెంటీస్ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రద్దయిన ఆ విధానాన్ని మళ్లీ తీసుకురావడం తగదన్నారు. ఉపాధ్యాయులను వెట్టిచాకిరిలోకి నెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపించారు. విద్యా హక్కు ప్రకారమే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని, వెంటనే అప్రెంటీస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని ఉల్లంఘించి సర్కారు నియామకాలు చేపడితే ఉద్యమాలకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- రేంజ్ డీఐజీ విశాల్ గున్ని



విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం వచ్చే ప్రజ లకు నిత్యం అందుబాటులో ఉంటానని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్ని అన్నారు. డీఐజీగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ స్థాయిలోనే ప్రజలకు న్యాయం జరిగేలా చేయడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. రేంజ్ పరిధిలో ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి అన్ని విభాగాలను పటిష్ట పరిచేందుకు కృషి చేస్తానన్నారు. పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల్లో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని, ఏజెన్సీలో గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం లేకుండా చర్యలు తీసుకుంటామని, నిబంధనలకు లోబడి పనిచేస్తూ ముందుకెళ్తామని చెప్పారు. సామాజిక మాధ్యమాల ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో కథనాలు ప్రచురించే ముందు వివరణ తీసుకోవాలని మీడియాను కోరారు. సోషల్ మీడియాలో కొందరు అత్యుత్సాహం ప్రదర్శించి కథనాలు పోస్టు చేయడం వల్ల ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. అందువల్ల ఒకటికి, రెండుసార్లు నిర్ధారణ చేసుకోవాలని విశాల్‌గున్ని అన్నారు.

15 రోజులుగా అందట్లే!

- పల్లెల్లో దాహం కేకలు
- సరఫరా కాని తాగునీరు
- పైలెట్ ప్రాజెక్టులో సమస్య
- దృష్టి సారించని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని వైనం
- మండిపడుతున్న పది గ్రామాల ప్రజలు

(పార్వతీపురం రూరల్)

జిల్లాకేంద్రానికి అతి సమీపంలోని ఉన్న పలు గ్రామాలు దాహార్తితో అలమటిస్తున్నాయి. ఇంకా పూర్తిగా వేసవి రాకముందే తాగునీటికి కటకటలాడుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 15 రోజుల పాటు ఈ సమస్య నెలకొనడంతో సుమారు పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు బిందెడు నీటి కోసం దూర ప్రాంతాలకు పరుగులు పెడుతున్నారు. వివిధ కారణాలతో రక్షిత నీటి పథకాల నుంచి ఆయా గ్రామాలకు కొద్దిరోజులుగా నీటి సరఫరా జరగడం లేదు. బోర్లు ఉన్నప్పటికీ చాలావరకు అవి మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఒకటి రెండు మినహా ఎక్కువగా బోర్లు లేకపోవడంతో పల్లెవాసులు తీవ్ర ఇక్కట్లపాలవుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదు. యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో గ్రామీణ ప్రాంతవాసులు పెదవి విరుస్తున్నారు.



నర్సిపురంలో మరమ్మతులకు గురైన పాత రక్షిత నీటి పథకం

ఇదీ పరిస్థితి..

మండలంలోని అతి పెద్ద గ్రామం నర్సిపురంతో పాటు డోకిశిల, జమిదాల, తాళ్లబురిడి, ఎంఆర్ నగరం, ములగ, ఎల్ఎన్ పురం, పూడిగాం, పెదబొండపల్లి, చినబొండపల్లి తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. 15 రోజులుగా ఆయా గ్రామస్థులకు రక్షిత పథకాల నుంచి నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో మహిళలు రోజూ నేల బావులు, వ్యవసాయ బోర్లు వద్దకు బిందెలు పట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. ఏటా వేసవిలో ఎదురయ్యే ఇబ్బందులు ఈ సారి ముందే ఎదురవడంతో వారంతా తలలు పట్టుకుంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని వారు ఇటీవల కలెక్టరేట్ స్పందనలో వినతిపత్రం ఇచ్చినా.. ఫలితం లేకపోయింది. కనీసం ట్యాంకర్ల ద్వారా కూడా తాగునీటిని అందించడం లేదు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపకపోవడంతో కొద్దిరోజుల కిందట డోకిశిల గ్రామంలో మహిళలు టీడీపీ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేదు. త్వరితగతిన సమస్య పరిష్కరించకుంటే ఆందోళన నను ఉధృతం చేస్తామని ఆయా ప్రాంతవాసులు హెచ్చరిస్తున్నారు.



దూర ప్రాంతాల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న నర్సిపురం మహిళలు

అసలు కారణమేమిటంటే..

వాస్తవంగా పార్వతీపురం మండలంలో ఆయా గ్రామాలకు మక్కువ మండలం డి-శిర్లాం వద్ద ఉన్న సూపర్ పైలెట్ ప్రాజెక్టు ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుంది. అయితే ఈ ప్రాజెక్టు ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురవుతుండడంతో మండల వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇసుక మేటలు వేయడం, మోటార్లు మొరాయించడంతో తరచూ ఈ సమస్య ఉత్పన్నమవుతన్నా.. శాశ్వత ప్రాతిపదికన అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



జిల్లాకేంద్రానికి అతి సమీపంలో ఉన్న నర్సిపురం గ్రామంలో 15 రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. దీంతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. టీడీపీ నాయకులు, గ్రామస్థుల తో కలిసి ఈ సమస్యను కలెక్టర్‌కు తెలియజేశాం. అయితే ఎటువంటి చర్యల్లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

- గొట్టాపు గౌరి,
మండల మాజీ ఉపాధ్యక్షురాలు, నర్సిపురం

చర్యలు తీసుకుంటున్నాం..

డి.శిర్లాంలోని సూపర్ పైలెట్ ప్రాజెక్టు స్కీంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇసుక మేటలను తొలగించి, పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేస్తాం.

- హనుమంతరావు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్,
పార్వతీపురం మన్యం

రేపు పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఆర్.వహీదా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ఫార్మసీ సంస్థలో వంద ట్రైనీ ఖాళీలను భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. నెలకు వేతనం రూ.15 వేలు చెల్లిస్తారని, 2019-2023 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌సీఎస్. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులు ఒరిజినల్స్, జిరాక్స్ కాపీ ధ్రువపత్రాలు, ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని తెలిపారు.

నేడు టీడీపీ నియోజకవర్గ సమావేశం

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో జరుగుతుందని టీడీపీ నగర, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శంఖారావం యాత్ర పేరిట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి సంబంధించి పార్టీ శ్రేణులకు వివరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు, టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు హాజరౌతారన్నారు. క్లస్టర్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జిలు, కుటుంబ సారథులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తాటిపాడులో ఎన్‌ఎస్‌ఎస్ సేవలు

రేగిడి: మండలంలో తాటిపాడు గ్రామంలో జీఎంఆర్ ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ సేవావిభాగం ఆధ్వర్యంలో సోమవారం సామాజికసేవలు కొనసాగాయి. ముందుగా స్వచ్ఛత అంశంపై గ్రామంలో చైతన్యర్యాలీలు, అనంతరం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు డ్రైనేజ్ పూడికలు తొలగింపు చర్యలు చేపట్టారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కేవీఎస్ ప్రసాద్, తాటిపాడు సర్పంచ్ బాబురావు, పాఠశాల హెచ్‌ఎం రాంబాబు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ భవనం పరిశీలన

రాజాం: బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి గుడి వెనుక భాగంలో నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పురపాలక సంఘం కమిషనర్ ఎల్ నల్ల అప్పలనాయుడు తదితరులు సోమవారం పరిశీలించారు. పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయించాలని పురపాలక సంఘం ఏఈ భాగ్యలక్ష్మిని ఆదేశించారు. కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించిన వెంటనే పెండింగ్ పనులు పూర్తిచేస్తామన్నారని ఏఈ వివరించారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

తెర్లాం: మండలంలోని గోపాలవలస పంచాయతీ జగన్నాథవలసలో సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్, జి.వెంకటరావు ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటా తాగునీటి పథకం పనులు పరిశీలించారు. రూ.67 లక్షలతో గ్రామంలోని అన్ని వీధుల్లో ఇంటింటా కొళాయి వేస్తున్నామని జేఈ తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నా రు.

చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

రామభద్రపురం: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.తిరుమలరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల దృష్ట్యా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో ఆరికతోట, రొంపల్లి, బూసాయ వలస, కొండ కెంగువ, కొట్టక్కి, రామభద్రపురం గ్రామాలను అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి రాజకీయ నాయకులపై 107, బైండోవర్ కేసులు పెడుతున్నామన్నారు. ఎస్ఐవి.జ్ఞాన ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు అడిగే నైతికహక్కు వైసీపీకి లేదు

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే నైతికహక్కు ఈ వైసీపీ ప్రభుత్వానికి లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ భూములన్నీ వైసీపీ నాయకులు ఆక్రమించుకొని పేద ప్రజలను నట్టేటముంచారన్నారు. జిల్లాలో 2 పంచదార పరిశ్రమలు, జనపనార పరిశ్రమలు మూతపడడంతో ఉపాధిలేక కార్మికులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్‌చార్జీలు పెంపు దారుణమని, ప్రత్యేక హోదా తెస్తామని ప్రకటించి మోదీ కాళ్లదగ్గర జగన్ పడడం సిగ్గుచేటన్నారు. సీపీఐ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాయి రవణమ్మ, సీఈఐ జిల్లా నాయకులు కండేపల్లి భూముడు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

రామభద్రపురం : కోటశిర్లాం పోలింగ్ స్టేషన్‌ను బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్ సౌకర్యం, ప్రహరీ తదితర వాటిపై బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేటట్టు చూడాలని కోరారు. ఎస్ఐ వి.జ్ఞానప్రసాద్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే వేగవంతం చేయండి

రాజాం/రూరల్: గ్రామాల్లో చేపడుతున్న కులగణన సర్వేను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శు లను ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు ఆదేశించారు. ఏ పంచాయతీలో ఎంత శాతం పూర్తిచేశారని అందరితో రివ్యూ నిర్వహించారు. ఇంటి పన్నుల వసూలు లక్ష్యాలను సకా లంలో పూర్తిచేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై ప్రశ్నించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం మొదలైపోయింది

● బాబు ష్యూరిటీలో టీడీపీ నాయకులు



విజయనగరంలో అదితి ప్రచారం



ఎస్‌కోట రూరల్: మాట్లాడుతున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట రూరల్: అధికార వైసీపీ పతనం మొదలైందని, కొద్దినెలల్లో ఐదు కోట్ల ఆంధ్రులు జగన్‌ను తరమికొట్టబోతున్నారని టీడీపీ రాష్ట్రకార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని సంతగైరమ్మపేట గ్రామంలో టీడీపీ విశాఖపార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ మాట్లాడుతూ మాట తప్పను మడమ తిప్పను అంటూ ప్రగల్బాలు పలికిన ముఖ్యమంత్రి మెగా డీఎస్సీ పేరుతో లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుని ఇప్పుడు కేవలం ఆరువేల పోస్టులకు డీఎస్సీ నిర్వహించడం దారుణమన్నారు. జుత్తాడ రామసత్యం, ఫైనాన్స్ వెంకటరావు, ఇందుకూరి శ్రీనురాజు, గనివాడ సన్యాసినాయుడు తదితరులు ఉన్నారు.

విజయనగరం రూరల్: రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల కాలంలో ప్రజావ్యతిరేక పాలన జరుగుతుందని, ఈ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని 30 వ డివిజన్ పరిధిలో ధర్మపురిలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని వ్యవస్థలను నాశనం చేసి, ప్రజలకు సుపరిపాలన అందించడానికి వీల్లేకుండా చేశారన్నారు. ఆయా డివిజన్ ఇన్‌ఛార్జి గేదేల ఆదిబాబు, చందక నాగరాజు, చందక సూరప్పడుతో పాటు తెలుగుయువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇళ్లు ఇవ్వకుండా వడ్డీ చెల్లించాలా?

● లబ్ధిదారుల ఆవేదన ● స్పందనలో వినతులు స్వీకరించిన కలెక్టర్

కలెక్టరేట్, ఫిబ్రవరి 12: గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల కోసం 2018లో లక్ష రూపాయలు కట్టాం. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమకు ఇళ్లు ఇవ్వకుండానే తమ పేరున రూ. 3,60,000 బ్యాంకు రుణం మంజూరైంది. రుణం తమకు ఇవ్వకుండా బ్యాంకు వారు ప్రతి నెల తమ పొదుపు ఖాతా నుంచి సుమారు మూడు వేలు చొప్పున రికవరీ చేసుకుంటున్నారు. ఖాతాలో డబ్బులు లేకపోతే బ్యాంకు సిబ్బంది ఫోన్ చేస్తుండడంతో ఇబ్బంది పడుతున్నాం. ఈ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని నెల్లిమర్ల గ్రామానికి చెందిన కొత్తకోట్ల వసంత కుమారి, కలిశెట్టి చంద్రమ్మ జగనన్నకు చెబుదాంలో మొరపెట్టుకున్నారు. ● తమ కాలనీకి చెందిన సుమారు 150 మంది వరకూ గ్రామానికి చెందిన సీత అనే మహిళవద్ద పప్పులు చీటీ కట్టారు. ప్రతి నెల రూ 350 చొప్పున ఏడాది పాటు డబ్బులు కట్టాం. జనవరిలో 20రకాలు సరుకులు ఇవ్వాల్సి ఉండగా గత కొద్ది రోజులు నుంచి ఆమె ఇంటి వద్ద లేరు. 156 మందికి సంబంధించి సుమారు 6,85,200 ఇవ్వాల్సి ఉంది. వెంటనే దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని జామి ఎస్సీ కాలనీకి చెందిన కృష్ణ కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ● 30 సంవత్సరాల క్రితం విజయనగరం మండలం జమ్మునారాయణపురం వద్ద ప్రభుత్వం మూడు ఎకరాలు డి.పట్టా మంజూరు చేయడంతో అప్పటి నుంచి భూమి సాగు చేసుకుంటున్నాం. పది సంవత్సరాలు క్రితం స్పోర్ట్ అథార్టీ వారు తమ భూమిని తీసుకుని పరిహారం ఇవ్వలేదు. వెంటనే పరిహారం ఇప్పించాలని విజయనగరానికి చెందిన ఎం.సన్యాసిరావు కోరారు. ● హుదూద్ తుపాన్ బాధితులకు ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు ఇమంది సుధీర్ కోరారు. గ్రామాల్లో భూములు రీసర్వే చేసిన సమయంలో రైతు లకు సక్రమంగా వివరాలు తెలియడం లేదని, విజయనగరం మండలం జొన్నవల సలో ఉన్న బీసీ వసతి గృహానికి బాగు చేయాలని, విజయనగరంలోని 40వ డివిజ న్‌లో బొగ్గులదిబ్బ ఎస్సీ కాలనీ సమస్యపై టీడీపీ నాయకులు.. ఇలా అనేక సమస్య లపై పలువురు వినతులు అందించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చె బుదాంలో సోమవారం వివిధ సమస్యలపై 201 వినతులు వచ్చాయి. వీటిని కలె క్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్, డీఆర్‌వో అనిత, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు

● ఏఎస్పీ అస్మాపరహీన్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 12: స్పందనకు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ అస్మాపరహీన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దీపికా ఆదేశాలతో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి, 41 ఫిర్యాదులు స్వీకరించారు. ● నగరంలోని కామాక్షినగర్‌కు చెందిన మహిళ ఏఎస్పీకి ఫిర్యాదు చేస్తూ, తన ప్రాంతంలో నివసిస్తున్న వ్యక్తి రైల్వేలో గుమస్తాగా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, తన వద్ద నుంచి రూ. 13 లక్షలు తీసుకున్నారని, మరో మూడు లక్షల కోసం ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోటును తీసుకున్నారని ఇదే విధంగా చాలా మంది వద్ద డబ్బులు తీసుకున్నట్టు తెలిసిందని, అడిగితే తిరిగి బెదిరిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఏఎస్పీ విచారణ చేపట్టి చట్ట పరిధిలో ఫిర్యాదికి న్యాయం చేయాలని విజయనగరం వన్‌టౌన్ సీఐని ఆదేశించారు. ● తన తల్లి వేపాడ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి కొంత స్థలాన్ని 1996లో కొనుగోలు చేసిందని, దీనిపై కోర్టులో కూడా తనకి అనుకూలంగా తీర్పు వచ్చిందని, అయినప్పటికీ, సదరు వ్యక్తులు స్థలం ఆక్రమించుకుని దౌర్జన్యానికి పాల్పడుతున్నా రని న్యాయం చేయాలని విశాఖపట్టణంకు చెందిన వ్యక్తి ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ● తాను కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని తన బంధువులైన కొంత మంది వ్యక్తులు ఆక్రమించాలన్న దురుద్దేశంతో తనను కొట్టి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, న్యాయం చేయాలని బొబ్బిలి మండలం గొల్లలపేటకు చెందిన వ్యక్తి ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇలా వచ్చిన పలు ఫిర్యాదులను స్వీకరించిన ఏఎస్పీ తక్షణమే పరిష్కరించి తీసుకున్న చర్యలను నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ గోవిందరావు, సీఐలు మురళీ, విజయానాద్, నర్సింహమూర్తి, అశోక్‌కుమార్, ఎస్ఐ ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులు స్వీకరిస్తున్న ఏఎస్పీ

మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్

రాజాం రూరల్: ఇక్కడి కోర్టు సముదాయ ప్రాంగణంలో వచ్చేనెల 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని జడ్జి బాబు వివరించారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టుఫీజు వాపసు ఇస్తారని జడ్జి బాబు స్పష్టం చేశారు.

4 గోదాముల నిర్మాణానికి తీర్మాణం

బొబ్బిలి, ఫిబ్రవరి 12: బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 2.4 కోట్ల రూపాయలతో నాలుగు గోదాములు, కోటి రూపాయలతో ప్రహరీ, మరమ్మతు పనులు చేపట్టాలని తీర్మానం చేశారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన బోర్డు సమావేశంలో కార్యదర్శి కె.ఈశ్వరరావు కమిటీ తరపున చేపట్టనున్న కార్యకలాపాలను వివరించారు. తెర్లాం మండలంలో 2, బొబ్బిలి, డొంకినవలసలలో ఒక్కొక్కటి చొప్పున గోదాముల నిర్మాణానికి అవసరమైన చర్యలతో ప్రతిపాదనలు పంపామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రెండు కోట్ల రూపాయల కమీషన్ సివిల్ సప్లయిస్ శాఖ నుంచి రావాల్సి ఉందన్నారు. కమిటీ కార్యాలయం ప్రాంగణంలో విశాలమైన స్థలం ఖాళీగా ఉన్నందున పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజల ప్రయోజనార్థం రైతు బజారు, వారపు సంతలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వైస్‌చైర్‌పర్సన్ తెంటు పార్వతి, డైరెక్టర్లు గునాన శ్రీరామ్మూర్తి, చెలికాని రాజగోపాల్, వెన్నెల అచ్యుత తదితరులు పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశం దృశ్యం

డ్రైవర్లకు వైద్య పరీక్షలు తప్పనిసరి

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 12: ఏపీ ఎస్‌ఆర్టీసీ డ్రైవర్లు క్రమం తప్ప కుండా వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఏపీ ఎస్‌ఆర్టీసీ శిక్ష ణ కేంద్రంలో శిక్షణ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపరాదని, ఖచ్చి తంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వేగంగా వాహనం నడపకూడదని, నిబంధనలు పాటించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంవీఐ రవిశంకర్ ప్రసాద్

న్యాయవాదులకు పుస్తకాల పంపిణీ

శృంగవరపుకోట: విశాఖ బార్ అసోసియేషన్ అందించిన నాభూమి, నా హక్కు, నాఇష్టం బుక్స్‌ను సోమవారం శృంగవరపుకోట కోర్టులో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లు సత్యాజీ న్యాయవాదులకు పంపిణి చేసారు. దీన్ని విశాఖ బార్ అసోసియేషన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు పతివాడ వెంకట గిరిధర్ రచించారు. న్యాయవాదులు డబ్ల్యుఎస్‌శర్మ, మండా కామేశ్వరరరావు, వారాది ఈశ్వరరావు, బోని శేఖర్ బాబు, బొబ్బిలి రామకృష్ణ, ఎస్.రామకృష్ణ తదితరులు వున్నారు.



న్యాయవాదులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బొబ్బిలి ఏఎంసీ ఆవరణలో రైతు బజారు

● ఎట్టకేలకు చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగం

బొబ్బిలి, ఫిబ్రవరి 12: బొబ్బిలి పట్టణంలో రైతు బజారు ఏర్పాటు కోసం అధికార యంత్రాంగంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఈ నెల 7 న 'కలగా రైతు బజారు ఏర్పాటు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై జేసీ స్పందించి రైతు బజారు ఏర్పాటు కోసం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. స్థానిక వ్యవసాయమార్కెట్ కమిటీ ఆవరణలో సుమారు మూడు ఎకరాలకు పైగా ఖాళీ స్థలం వృథాగా ఉండడంతో దీనిని రైతుబజారు అవసరాలకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి కె.ఈశ్వరరావు, డైరెక్టర్లు సోమవారం స్థలాన్ని పరిశీలించి అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. స్థానిక పెట్రోలు బంకు జంక్షన్ నుంచి పోలీసుస్టేషన్, కోవెల సెంటరు మీదుగా అమ్మిగారి కోనేరు గట్టు జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు కూడా పూర్తవడం, పెద్ద సంఖ్యలో కాలనీలు, అపార్టుమెంట్లు, బహుళ అంతస్తుల్లో వ్యాపారకూడళ్లు వెలవడంతో ఏఎంసీ స్థలం వాహనాల రాకపోకలకు, వినియోగదారులకు అనువుగా ఉందని అన్ని వర్గాల వారు భావిస్తున్నారు.

● బొబ్బిలి పట్టణంలో రాజానగర్ కాలనీ సమీపంలో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహించే వారపు సంతను కరోనా సమయంలో పూర్తిగా మూసివేశారు. ప్రతి బుధవారం ఈ వారపు సంతను ఏఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై వ్యవసాయమార్కెట్ కమిటీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. పశువులు, కోళ్లు, గొర్రెలు, చేతి వృత్తుల వారి ఉత్పత్తులు, ఆహారదినుసులు తదితర సామగ్రిని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కొనుగోలు, అమ్మకం చేసుకునేందుకు ఈ వారపుసంత వేదికగా ఉంటుంది. సంతకు వచ్చే వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేసే ప్రక్రియను బహిరంగ వేలం ద్వారా నిర్ణయించనున్నారు. పార్వతీపురం తదితర సంతలకు వెళ్లి, అధ్యయనం చేసి మరికాస్త మెరుగ్గా బొబ్బిలి సంతను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఎంసీ కార్యదర్శి ఈశ్వరరావు తెలిపారు.



రైతు బజారు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

శంఖారావాన్ని విజయవంతం చేయండి



ఎల్‌కోట: మాట్లాడుతున్న లలితకుమారి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 12: నారా లోకేష్ చేపడుతున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి కోరారు. సోమవారం ఎల్.కోటలోని ఆమె నివాసం వద్ద జరిగిన నియోజక వర్గ నేతల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 17న సోంపురం జంక్షన్ వద్ద సమావేశం ఉంటుందని, నియోజకవర్గం నుంచి వేలాది మంది యువకులు తరలిరావాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్, మాజీ జడ్పీ టీసీ కరెడ్ల ఈశ్వరరావు, జీఎస్ నాయుడు, 5 మండలాల పార్టీ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **జామి:** నారా లోకేష్‌బాబు శంఖారావం సభలతో అధికార వైసీపీలో గుబులు మొదలైందని కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం జామిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 17న లక్కవరపుకోట మండల కేంద్రంలో జరగనున్న శంఖారావం సభ విజయవంతానికి ప్రతి నాయకుడు కృషిచేయాలని కోరారు. మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, మాకిరెడ్డి శ్రీలక్ష్మి, వర్రి రమణ తదితరులున్నారు. ● **తెర్లాం:** బొబ్బిలి నియోజకవర్గం బాడంగి టీడీపీ కార్యాలయం ఎదురుగా బుధవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమానికి నారా లోకేష్ హాజరవుతున్నారని మండల పార్టీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, జనసేన నేతలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్ఐ రవివర్మ

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 12: విజయనగరం రైల్వేస్టేషన్‌లో డీఎస్పీ బి.మోహనరావు, జీఆర్పీ ఇన్‌స్పెక్టరు కె.వెంకటరావు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ రవి వర్మ, సిబ్బంది తనిఖీలు చేస్తుండగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని గుర్తించారు. సౌత్‌డిల్లీకి చెందిన నీరజ్‌సింగ్ నేగి 17.6 కిలోలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని, గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలిస్తున్నట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో జీఆర్పీతో పాటు ఆర్పీఎఫ్ ప్రత్యేక టీంలు నిఘా ఏర్పాటు చేసి విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, అరకు పోలీసు స్టేషన్ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

● విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాలతో విజయనగరం రైల్వే పోలీసులు తనిఖీలు చేయగా గాజులరేగకు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి రాయగడ నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తూ పట్టుబడ్డారు. అతని వద్ద నుంచి ఆరు సీసీలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్ఐ రవివర్మ తెలిపారు.

సారాతో ఇద్దరు అరెస్టు

జియ్యమ్మవలస: అక్రమంగా తరలిస్తున్న 120 లీటర్ల(6 ప్లాస్టిక్ క్యాన్లు) సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేసినట్టు చినమేరంగి సబ్‌ఇన్‌స్పెక్టర్ ఇ.చిన్నంనాయుడు తెలిపారు. సోమవారం చినమేరంగి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సారాను తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నామని, వీరిద్దరినీ రిమాండ్‌కు పంపించామన్నారు.

గడివలస హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

సాలూరు/రూరల్: సంచలనం సృష్టించిన పాచిపెంట మండలం గడివలస హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్టు సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఆయన సోమవారం విలేఖరులతో మాట్లాడారు. పొలంలో శనివారం సాయంత్రం కోరాడ జోగేశ్వర్ గొంతు కోసి హత్య చేసిన విషయం విదితమే. ఈ కేసును దర్యాప్తు చేసిన సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ నిందితులు కోరాడ నరసింహులు, కోరాడ అప్పారావు, కోరాడ ఉమామహేశ్వరరావులను మంచాడవలస జంక్షన్ వద్ద మధ్యాహ్నం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. పాచిపెంట ఎస్ఐ పొదిలాపు నారాయణరావు పాల్గొన్నారు.

గొలుసుదొంగ అరెస్ట్

● ఆరునెలల జైలు విధించిన న్యాయస్థానం

జామి, ఫిబ్రవరి 12: గొలుసు దొంగతనం కేసులో నిందితుడికి ఆరునెలల జైలు శిక్ష పడినట్లు జామి ఎస్ఐ వీరబాబు తెలిపారు. ఈ విషయంపై సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ మూడో తేదీన విజయనగరం నుంచి ద్విచక్రవాహనంపై అలమండ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న లోట్లపల్లి పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి విధులకు వెళ్తుండగా ఒక చైన్‌స్నాచర్ ఆమె మెడలో ఉన్న బంగారు చైన్ తెంపుకొని పారిపోయాడు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన భీమరశెట్టి కమలనాథ్ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అతని వద్ద చైన్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. అనంతరం ఎస్.కోట మేజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా ఆరునెలల జైలు, ఐదువేలు జరిమానా విధించారని తెలిపారు.

హత్యకేసు ముద్దాయికి జీవిత ఖైదు

సాలూరు రూరల్: హత్య కేసులో ముద్దాయికి పార్వతీపురం ఏడీఎస్‌జే కోర్టు జీవిత ఖైదు వేసినట్టు సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఆయన సోమవారం విలేఖరులతో మాట్లాడారు. తోణాం పంచాయతీ బింగుడువలసకు చోడిపల్లి సీతమ్మను చిల్లంగి ఉందనే నెపంతో సెప్టెంబర్ 16, 2016లో నాటు తుపాకీతో చోడిపల్లి రాజయ్య కాల్చి చంపాడు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో రాజయ్యకు జీవిత ఖైదును కోర్టు విధించిందన్నారు.

రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న సీపీఐ కార్యకర్తలు

● కార్యాలయంలోకి వెళ్లనివ్వకుండా అడ్డగా బైఠాయింపు

● సాగుహక్కు కల్పించాలంటూ డిమాండ్

రామభద్రపురం, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని కొట్టక్కి గ్రామంలో 537 సర్వేనెంబరులో 2006లో ప్రభుత్వం మంజూరు చేసిన డీపట్టా భూములకు సాగుచేయకుండా భూస్వాములు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ సీపీఐ కార్యకర్తలు మండల రెవెన్యూ కార్యాలయాన్ని దిగ్బంధం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ప్రధాన గేటు వద్ద బెంచీలు వేసి హెచ్‌డీటీ సుబ్బారావు, వీఆర్వోలు, ఇతర ఉద్యోగులను లోనికి వెళ్లకుండా అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. 18 సంవత్సరాల నుంచి ప్రభుత్వం తమకిచ్చిన భూములను సాగు చేస్తుంటే విశ్రాంత ఉద్యోగులు టొంపల నాగరాజు, బాలమ్మ తమ భూములు సాగుచేయకుండా అడ్డుకోవడంతోపాటు తమపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఈసమస్య పరిష్కరించాలని గత నెల 25వ తేదీన రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చామని, అయినప్పటికీ రెవెన్యూ అధికారుల చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమని హెచ్‌డీటీ సుబ్బారావుతో వాదించారు. సుమారు 3 గంటలపాటు అధికారులను కార్యాలయంలోకి వెళ్లకుండా చేయడంతో ఎస్ఐ వి.జ్ఞానప్రసాద్, పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున మోహరించి వారికి నచ్చచెప్పినా ఫలితంలేకపోయింది. తహసీల్దార్ సమక్షంలో ఈ సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో వారంతా కొంతసమయం విరామం ప్రకటించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అలమండ ఆనందరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు బాయి రవణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కే.భీముడు, లెంక లక్ష్మ పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయం ప్రధాన ద్వారంవద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రీ సర్వే దరఖాస్తులు పరిష్కరించాలి

కలెక్టరేట్: భూములు రీసర్వేకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం ఆయా శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సర్వే రాళ్ళు పాతి పెట్టే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల విధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఓటర్లజాబితా చేర్పులు, మార్పులు వచ్చిన దరఖాస్తులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు.

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి ఎంపిక

రేగిడి, ఫిబ్రవరి 12: ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోషియేషన్ రాష్ట్రకార్యదర్శిగా రేగిడి మండలం కందిశ కావ్యస్కూల్ ప్రిన్స్‌పాల్ కెల్ల మన్మథరావు నియామకమయ్యారు. ఈమేరకు మన్మథరావు సోమవారం స్థానిక విలేఖర్లకు తెలిపారు. చిత్తూరు జిల్లా తిరుపతిలో ఆదివారం రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ మేరకు బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన వెల్లడించారు. ప్రైవేటు పాఠశాలల్లో దీర్ఘకాలిక సమస్యలు, ఉపాధ్యాయుల హక్కులపై ప్రభుత్వంతో చర్చించి తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు.

పార్కింగ్.. ఓ ప్రహసనం

● రాజాంలో పార్కింగ్ స్థలాలు లేక ఇక్కట్లు ● రోడ్డుపైనే వాహనాలు.. చలానాలు వసూలు చేస్తున్న పోలీసులు

రాజాం రూరల్

● డోలపేటకు చెందిన శ్రీనివాస్ రాజాం మెయిన్‌రోడ్ లోని సంపత్ భవన్‌కు వచ్చి తన ద్విచక్ర వాహనం పార్క్ చేసి షాపింగ్ కాంప్లెక్స్ లోపలికి వెళ్లాడు. పదిహేను నిమిషాల తరువాత అతని సెల్‌కు ఓ సమాచారం వచ్చింది. రోడ్డుపక్కనే వాహనాన్ని నిలుపుదల చేసినందుకు రూ.200 చలానా విధించినట్లు మెసేజ్ సారాంశం..

● పొగిరికి చెందిన రమేష్ శ్రీకాకుళం రోడ్‌లోని స్టేట్‌బ్యాంకు ఎదుట తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి బ్యాంకు లోపలికి వెళ్లాడు. అరగంట తరువాత తిరిగి వచ్చేసరికి వాహనం ఫ్లగ్‌పిన్ లేదు. దీంతో ఈసురోమంటూ మెకానిక్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ సమస్య ఓ శ్రీనివాస్‌దో, మరో రమేష్‌దో కాదు.. రాజాం కేంద్రంగా విద్య, వైద్యం, బ్యాంకింగ్, శిక్షణ ఇతరత్రా అవసరాల కోసం సుమారు 13 మండలాల నుంచి ద్విచక్ర వాహనాలపై వచ్చిపోయే వందలాది మంది ఎదుర్కుంటున్న సమస్య ఇదే.

● ఎందుకిలా...

గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెందినా, నాలుగువైపులా కిలోమీటర్ మేర పట్టణం విస్తరించినా.. పార్కింగ్ స్థలాలు లేకపోవడమే రాజాంలో ప్రధాన సమస్యగా చెప్పుకోవచ్చు. దశాబ్దకాలంగా ఇదే పరిస్థితి ఉన్నా.. అటు అధికారులు గానీ ఇటు నాయకులు గానీ పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఫలితంగా రాజాం రావాలంటే వాహనచోదకులు భయపడుతున్నారు. తమ ద్విచక్ర వాహనాన్ని ఎక్కడ పార్క్ చేయాలనే భయం వారిని వెంటాడుతోంది. మరోమార్గం లేక మెయిన్‌రోడ్‌కు ఇరువైపులా వాహనాలను పార్క్ చేస్తున్నారు. పని ముగించుకుని వచ్చేలోపు పోలీసులు ఓ ఫోటో తీసి సెల్‌కు మెసేజ్ పంపిస్తున్నారు. లేదా వాహనం ఫ్లగ్ తీసి తమ వెంట పట్టుకుని వెళ్లిపోతున్నారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు.

● ట్రాఫిక్ సమస్యకు మూలం..

రాజాంలో ట్రాఫిక్ సమస్యలకు ద్విచక్ర వాహనాలు, ఆటోలే ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఇప్పటికే ఫుట్‌పాత్ ఆక్రమణకు గురైంది. రెండు లైన్లలో ద్విచక్ర వాహనాలు, వాటిని ఆనుకుని ఆటోలు నిలిపివేస్తున్నారు. దీంతో 40 అడుగుల రహదారిలో పట్టుమని పది అడుగులు కూడా ఉండడం లేదు. దీంతో బస్సులు, ఇతరత్రా వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. నడకా నరకంగానే మారుతోంది. మాధవబజార్, పాత బజార్, శ్రీనివాసా రోడ్ ప్రాంతా ల్లో సమస్య తీవ్రంగా మారుతోంది. ఆయా ప్రాంతాల్లో రోడ్డుపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. దీంతో రాకపోకలు కూడా ఇబ్బందిగానే మారింది.



రాజాం సంపత్‌భవన్, మాధవబజార్ సమీపంలో దుస్థితి

● కొరవడిన సమన్వయం..

అధికారుల సమన్వయం కొరవడింది. మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్ అధికారులు సమన్వయంతో పనిచేస్తే తాత్కాలికంగా అయినా పార్కింగ్ స్థలాలు సమకూర్చడం పెద్ద సమస్య కాదన్న వాదన వినిపిస్తోంది. బస్టాండ్, ఆర్‌అండ్‌బీ, ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో ఆక్రమణలు తొలగించి ఆయా ప్రాంతాల్లో తాత్కాలికంగా పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు అవకాశాలున్నా అధికారులు చొరవ తీసుకోకపోవడంతో సమస్య జటిలమైంది.

అర్జీలు సత్వరమే పరిష్కరించండి

● 'స్పందన'లో కలెక్టర్ ఆదేశం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: 'స్పందన'లో ప్రజలు అందించే అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని.. సరైన పరిష్కారం చూపాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమా వేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 167 అర్జీలను ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై అందించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథం, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పి.డి. రామచంద్రరావు, జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ 'స్పందన'కు 126 వినతులు


వినతులు స్వీకరిస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్‌సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 126 వినతులు వచ్చినట్టు పీవో కల్పనాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఉద్యానవనాల అధికారి గణేష్, వ్యవసాయాధికారి హరికృష్ణ, జీసీసీ డీఎం సంధ్యారాణి, డీడీ మంగవేణి, సీడీపీఓ రంగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు 'స్పందన'లో...

బెలగాం, ఫిబ్రవరి 12: 'స్పందన' కార్యక్రమంలో ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు ఏఎస్పీ సునీల్ షరోన్ తెలిపారు. పార్వతీపురంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏఎస్పీ సునీల్ షరోన్ ఆధ్వర్యంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ నేరుగా అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్బీ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, డీసీఆర్బీ సీఐ వాసునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' కల్పించాలి

● వెలగవలస గిరిజనుల డిమాండ్

బెలగాం, ఫిబ్రవరి 12: వెలగవలస పంచాయతీలోని ఐదు గ్రామాల గిరిజనులకు ఉపాధి హామీ పనులు కల్పించాలని గిరిజన సంఘ నాయకులు రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాము మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగేళ్ల కిందట బెలగోర్ది వలస, ధోనిగెడ్డ వలస, సందివలస తదితర 5 గిరిజన గ్రామాలతో వెలగవలసను పంచాయతీ చేసి ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇచ్చిందన్నారు. కానీ పని కల్పించడం లేదని తెలిపారు. ఈ విషయమై అధి కారులను కోరితే మీ పంచాయతీ ఆన్‌లైన్‌లో చూపించడం లేదని చెబుతున్నారని అన్నారు. వెంటనే వెలగవలస పంచాయతీని ఆన్‌లైన్ చేసి ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 12: జ్యూయలరీ షాపుల యజమానులు తమ షాపుల్లో సీసీ కెమెరాలతో పాటు భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని సెంట్రల్ క్రైం స్టేషన్ సీఐలు అప్పారావు, సుధాకర్ సూచించారు. ఇటీవల జరుగుతున్న నేరాలకు సంబంధించి సోమవారం ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో జ్యూయలరీ షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. దొంగ బంగారం, వెండి వంటి వస్తువులు కొన్న వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. పార్వతీపురం పట్టణ ఎస్ఐలు రవీంద్రనాథ్, సంతోషి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వంతెనకు గ్రహణం

కొమరాడ, ఫిబ్రవరి 12: మండలంలోని పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే నిలిచిపోయిందని బీజేపీ నాయకులు, అరకు పార్లమెంట్ లబ్ధిదారుల కమిటీ మెంబరు హేమనాయక్ అన్నారు. సోమవారం పల్లెకుపోదాం కార్యక్రమంలో భాగంగా కొమరాడ మండలంలో ఆయన పర్యటించారు. నాగావళి నదిపై అసంపూర్తిగా ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెనను పరిశీలించారు. దీని నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని చెప్పారు. దీనివల్ల 32 గిరిజన గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ గండి మురళీమోహన్, జిల్లా అధికార ప్రతినిధి రాంజీ పాత్రో, జిల్లా కార్యదర్శి మడక రవినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు ద్వారపూడి సురేష్, మండల యువ మోర్చా అధ్యక్షులు పెద్దిరెడ్డి అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు: డీఎంవో

గరుగుబిల్లి, ఫిబ్రవరి 12: జిల్లాలో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని డీఎంవో జగన్మోహనరావు ఆదేశించారు. సోమవారం ఉద్దవోలు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ వైద్య సేవలు పొందిన వారి వివరాలను రికార్డుల్లో పరిశీలించి ఆరోగ్య సమస్యలు, అందజేసిన చికిత్సను తెలుసుకున్నారు. కొత్తగా గుర్తించిన దీర్ఘకాలిక రోగులను పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కువగా రక్తహీనతపై దృష్టి సారించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షించాలని తెలిపారు. తక్కువగా గుర్తించిన వారికి నిర్దేశించిన చికిత్స అందజేయాలని స్పష్టం చేశారు. అవసరమైన వారికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. అనంతరం హిమోగ్లోబిన్ శాతం తరచుగా తక్కువగా ఉంటున్న మహిళలకు శిబిరంలో సికిల్ సెల్ టెస్టును స్వయంగా జరిపి పరిశీలించారు. 104 వాహనంలో మందులు, వైద్య పరికరాలు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో మంచానికి పరిమితమైన వృద్ధురాలి గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలన చేశారు. డాక్టర్ సాగర్‌వర్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఉదయకుమారి, వైద్య సిబ్బంది ఉన్నారు.

వైసీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్

సాలూరు, ఫిబ్రవరి 12: పార్వతీపురం మన్యం జిల్లా వైసీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా గొర్లె ప్రవీణ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి ఫోన్‌లో ఆదేశాలు వచ్చినట్లు ఆ పార్టీ పట్టణ నాయకులు వంగపండు అప్పలనాయుడు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో సమావేశం నిర్వహించారు. ప్రవీణ్ కుమార్ ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు. అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ పైడితల్లి శ్రీనువాస్ భరత్ కుమార్‌తో పాటు పలువురు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుల్లమద్ది చిన్న, ఎంఎస్ నారాయణ, బి.సత్యప్రసాద్, యశోద కృష్ణ పాల్గొన్నారు.

స్థానిక మిల్లులకు అవకాశం ఇవ్వండి

పాలకొండ: పాలకొండ, వీరఘట్టం మండలాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలుకు స్థానిక మిల్లులకే అవకాశం ఇవ్వాలని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. స్పందన కార్యక్రమంలో జేసీకి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ధాన్యం సేకరణ సమయం ఈ నెల 4న ముగుస్తుందని తెలిసిన రైతాంగం ఆందోళన చెందుతోందన్నారు. మార్చి నెల మొదటి వారం వరకు ధాన్యం సేకరణ గడువును పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు వలరౌతు చంద్రశేఖర్‌నాయుడు, గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామ మందిర వార్షికోత్సవం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని రామ మందిర ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సరిపల్లి రవిశాస్త్రి ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రామ మందిరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా భారీ ఎత్తున అన్న సమారాధన చేశారు.

శతశాతం ఫలితాలు సాధించాలి

సాలూరు రూరల్, ఫిబ్రవరి 12: తోణాం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించాలని నోడల్ అధికారి, జీసీసీ డివిజినల్ మేనేజర్ ఉరిటి మహేంద్రకుమార్ అన్నారు. ఆయన సోమవారం పాఠశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా స్థాయిని పరిశీలించారు. అనంతరం డీఆర్ డిపోలను పరిశీలించారు.

డీఐజీని కలిసిన ఎస్పీ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్నిని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కలిశారు. సోమవారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిసినట్టు ఎస్పీ తెలిపారు.

కొఠియాను బయోడైవర్సిటీ ప్రాంతంగా ప్రకటించాలి

సాలూరు రూరల్, ఫిబ్రవరి 12: కొఠియాను ఒడిశా ప్రభుత్వం బయోడైవర్సిటీ ప్రాంతంగా ప్రకటించాలని ఒడిశా రాష్ట్రం జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ వాహినీపతి డిమాండ్ చేశారు. ఆయన భువనేశ్వర్‌లో సోమవారం విలేఖరులతో మాట్లాడారు. తమ భూమిలోకి ఏపీ చొచ్చుకు వస్తున్నా.. ఒడిశా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. కొఠియా గ్రామాల్లో ఏపీ జెండాలు ఎగురవేస్తోందన్నారు. దేవ్‌మాలి కొండలతో సహా కొఠియా ప్రాంతాన్ని ఒడిశా బయోడైవర్సిటీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

శంఖారావాన్ని విజయవంతం చేయండి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 12: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం ఉల్లిభద్ర సమీపంలో నిర్వహించనున్న శంఖారావం విజయవంతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి, రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్‌లు అన్నారు. సోమవారం సాయంత్రం శంఖారావం నిర్వహించే బహిరంగ సభ ప్రాంగణాన్ని వీరు పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుత అధికార వైసీపీపై ప్రజలు విసుగు చెంది ఉన్నారన్నారు. లోకేష్ నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, జి.సుదర్శనరావు, ఎ.మధుసూదనరావు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, ఎం.పురుషోత్తంనాయుడు, ముదిలిబాబు విజయ వాంకుశం, అంబటి తవిటినాయుడు, కోట భరత్, ఎం.వెంకటేష్, ఆర్నిపల్లి గంగాధర్‌నాయుడు, పి.వెంకటనాయుడు, లంక గోపాలం, ఎం.నారాయణ స్వామి, గౌరీశంకరరావుతో పాటు జనసేన పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.


శంఖారావం బహిరంగ సభ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శత్రుచర్ల తదితరులు


శంఖారావం కార్యక్రమంపై సమీక్షిస్తున్న వీరేష్ చంద్రదేవ్, తదితరులు

ఏర్పాట్ల పరిశీలన

పాలకొండ: టీడీపీ యువనేత నారా లోకేష్ శంఖారావాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ అన్నారు. పాలకొండ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం జరుగనున్న శంఖారావం సభా ఏర్పాట్లను పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుత వైసీపీ పాలనలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందనే విశ్వాసంతో ప్రజలు ఉన్నారన్నారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్

రేపు పార్వతీపురంలో...


సమావేశంలో మాట్లాడుతున్న విజయచంద్ర, జగదీష్, చిరంజీవులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: నియోజకవర్గంలో ఈ నెల 14న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో సోమవారం విజయచంద్ర మాట్లాడుతూ త్వరలో టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అమలు చేయనున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను లోకేష్ వివరిస్తారని చెప్పారు. పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్ మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో తోటపల్లి ప్రాజెక్టును పూర్తి చేయడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. ఉద్యాన కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను ఏర్పాటు చేశామన్నారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో పార్వతీపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకట్‌నాయుడు, మజ్జి వెంకటేష్, జనసేన నాయకులు శంకరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ వాహనాలతో కాలుష్యం

● రేగుతున్న దుమ్ము, శబ్దాలతో అనారోగ్యం

● రాకపోకలను నియంత్రించండి

● కలెక్టరేట్ వద్ద పెదగుడబ గ్రామస్థుల నిరసన


నిరసన తెలుపుతున్న పెదగొడబ గ్రామస్థులు

బెలగాం, ఫిబ్రవరి 12 : తమ గ్రామం మీదుగా క్వారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని గరుగుబిల్లి మండలానికి చెందిన పెదగుడబ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్వారీకి చెందిన భారీ వాహనాల రాకపోకల వల్ల దుమ్ము, ధూళితో వాతావరణం కలుషితమవుతుందని, శబ్దాల వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని తెలిపారు. ఇంతకుముందు తోటపల్లి కాలువ మీదుగా వాహనాలు ప్రయాణించేవని, కొద్ది రోజులుగా తమ గ్రామం మీదుగా రాత్రి, పగలు అని తేడా లేకుండా వెళ్తున్నాయని చెప్పారు. శబ్ద, వాయు కాలుష్యం కారణంగా నిద్రకు దూరమవుతున్నామని, రాత్రిపూట బ్లాస్టింగ్ చేయడంతో ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని ఆ గ్రామస్థులు వాపోయారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వారి నిరసనకు జనసేన నాయకుడు పాలూరి బాబు మద్దతు తెలిపారు. పెదగుడబ-చినగుడబ సమీపంలో అనుమతులకు మించి తవ్వేశారని, స్థానిక ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆయన చెప్పారు. మైనింగ్ కంపెనీ కోసం ప్రభుత్వ నిధులు వెచ్చించి అధికారులు రోడ్డు సైతం వేశారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం క్వారీ నిర్వాహకులు నడుచుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

సాలూరు, ఫిబ్రవరి 12: రహదారి భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ఎస్ ప్రసాద్ కోరారు. రహదారి భద్రతా ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ట్యాక్సీ స్టాండ్ ఆవరణలో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

భద్రతా నియమాలతో ప్రమాదాలకు దూరం

సీతానగరం, ఫిబ్రవరి 12: రహదారి భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని ఎంవీఐ శశికుమార్, ఏఎంవీఐలు జి.సత్యనారాయణ, ఎస్.రమేష్ కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక హనుమాన్ కూడలి ఎదుట ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహన యజమానులు, ప్రజలతో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహన యజమానులు, స్థానికులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్ పోటీల్లో పైడిరాజుకు పతకాలు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 12: హైదరాబాద్‌లో ఈ నెల 11 వరకు జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో సాలూరు మండలం మామిడిపల్లికి చెందిన క్రీడాకారిణి కనకల పైడిరాజు రజత, కాంస్య పతకాలు సాధించింది. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 8 నుంచి 11 వరకు జాతీయ అథ్లెటిక్ పోటీలు జరిగాయి. ఆమెను సాలూరు వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, మామిడిపల్లి సర్పంచ్ శశికళ, పీఏసీఎస్ అధ్యక్షుడు పెద్దింటి మాధవరావు, గ్రామపెద్దలు బూస తవుడు, పొట్నూరు రమణ, తాడూతూరి శ్రీనివాసరావు, పోలినాయుడు తదితరులు అభినందించారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

కురుపాం, ఫిబ్రవరి 12: మండల సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వైద్యశాఖ, జీసీసీ, విద్యుత్, ఆర్‌టీసీ తదితర శాఖల అధికారులు హజరు కాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఇప్పటికైనా పనితీరు మార్చుకొని మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కోరారు. గుజ్జువాయి సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఏడాది రాయితీపై వ్యవసాయ పరికరాల కోసం డబ్బులు చెల్లించినా ఇంతవరకు అందజేయలేదన్నారు. తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇప్పించాలని వ్యవసాయ అధికారి నాగేశ్వరరావును కోరారు. మండలంలో వ్యవసాయ శాఖ చేపడుతున్న పనులు ప్రజాప్రతినిధులకు తెలియజేయడం లేదని ఏఓ నాగేశ్వరరావును ఎంపీపీ నిలదీశారు. ఇకపై అలా జరగకుండా చూస్తామని ఏఓ బదులిచ్చారు. ఈ సమావేశంలో జెడ్‌పీటీసీ గొర్లి సుజాత, ఎంపీడీఓ అప్పారావు, ఉప సర్పంచ్ బిడ్డిక అన్నాజీరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి పనులపై సమగ్ర విచారణ చేపట్టండి

సీతంపేట: జిల్లా గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న డోకులగూడ రహదారి పనుల్లో అవకతవకలపై ఐటీడీఏ పీవో, కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు డిమాండ్ చేశారు. సోమవారం డోకులగూడ రహదారి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సీతంపేటలో విలేకరులతో మాట్లాడారు. రాళ్లు పేల్చకుండానే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు రూ.35 లక్షల దుర్వినియోగానికి పాల్పడ్డారని అన్నారు. ఈ విషయం ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిందన్నారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడానికి ఆ గ్రామాన్ని తాము సందర్శించి స్థానికుల నుంచి క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకున్నట్టు చెప్పారు. ఈ రహదారి పనులు చేయకుండానే రాళ్లు పేల్చినట్టు రూ.35 లక్షలకు ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయమై గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని మన్మథరావు స్పష్టం చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గోపినాయుడు, సీపీఐ మండల అధ్యక్షుడు జనార్దనరావు పాల్గొన్నారు.

పేదలకు తక్కువ ధరలకే మందులు

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 12: పేదలకు అతి తక్కువ ధరలకే జన ఔషధ్ షాపుల ద్వారా మందులు అందిస్తామని ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ వి.వెంకట చినరామునాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని పాతబస్టాండ్ కూడలి వద్ద జన ఔషధ్ షాపును ఎమ్మెల్యే జోగారావుతో కలసి ఆయన ప్రారంభించారు. పేదలకు అన్ని విధాలుగా అండగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.

సీఐ సేవలకు ప్రశంసలు

సాలూరు, ఫిబ్రవరి 12: పట్టణ సీఐ జి.డి.బాబు సేవలను మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ పువ్వల పైడితల్లి, శ్రీవాస్ భరత్ కుమార్ తదితరులు ప్రశంసించారు. సోమవారం ఆయనకు స్టేషన్ వద్ద దుశ్శాలువతో సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ సీఐగా విధుల్లోకి చేరి అతి తక్కువ కాలంలోనే నాటు సారాపై ఉక్కు పాదం మోపారని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సారా లేకుండా చేస్తున్నారని అన్నారు. గతంలో మున్సిపాల్టీలో సారా అమ్మకాలు ఎక్కువగా సాగాయని.. దీని నిర్మూలనకు సీఐ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయండి

సీతంపేట: దేశవ్యాప్తంగా ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను అవలంబిస్తోందని.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమం తలపెట్టామని తెలిపారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సురేష్, ఎం.కాంతారావు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

పాలకొండ: గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జేఏసీ ఉమ్మడిగా పిలుపునిచ్చాయి. సిటు మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము, రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గేదెల సత్యం, ఎడ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను అవలంభిస్తోందని అన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర కల్పించండి

గుమ్మలక్ష్మీపురం: జీడికి కనీస మద్దతు ధర రూ.200 పెంచి గిరిజనుల నుంచి జీసీసీ నేరుగా కొనుగోలు చేయాలని చెముడుగూడ ఎంపీటీసీ మండంగి రమణ అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏటా గిరిజనుల ప్రధాన జీవనాధారమైన జీడిపంటను పండిస్తున్నా కనీస మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత నాలుగేళ్లుగా పంట దిగుబడి పూర్తిగా తగ్గుతూ వస్తోందని తెలిపారు. చేతికి అందిన కొద్ది పంటనైనా ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఏడాది చింతపండు కేజీ రూ.60, పసుపు కేజీ రూ.150, కొండచీపుర్లు రూ.120కి కొనుగోలు చేయాలని కోరారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రమణ డిమాండ్ చేశారు. స్పందించిన వైద్యులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్అండ్‌బీ, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, ఐసీడీఎస్ తదితర శాఖలపై చర్చ జరిగింది. సమావేశంలో ఎంపీపీ కె.దీనమయ్య, జెడ్‌పీటీసీ రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, ఎం.లక్ష్మణరావు, బీసీ రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, ఎంపీడీఓ జగదీష్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సీతంపేట: కొండపోడు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాల నియంత్రణపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నట్టు అటవీ శాఖ పాలకొండ రేంజర్ తవిటినాయుడు స్పష్టం చేశారు. సోమవారం బర్న రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న సిరికొండ, మీన కోట గ్రామంలో గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కొండచీపుర్లు, జీడిసాగు చేస్తున్న ప్రాంతాల్లో ఫలసాయం అయిపోయిన తర్వాత అగ్గిపెట్టడం గిరిజనులకు ఆనవాయితీగా వస్తోందన్నారు. మంటల కారణంగా కొండల్లో ఉండాల్సిన జంతువులు మైదాన ప్రాంతాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు 200 గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించామన్నారు.

సీఎం జగన్‌రెడ్డి పాలనలో అధోగతి

● టీడీపీ ఇన్‌చార్జి సంధ్యారాణి ● కొట్టుపరువులో టీడీపీలో భారీగా చేరికలు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 12: సీఎం జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని సాలూరు టీడీపీ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో సోమవారం కొట్టుపరువు పంచాయతీలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావేదిక విధ్వంసంతో రాష్ట్ర పాలనను సీఎం జగన్‌రెడ్డి ఆరంభించి అధ్వాన్నంగా చేశారన్నారు. నిత్యావసర ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి లేకుండా పరిశ్రమలను తరిమివేశారన్నారు. రూ.13 లక్షల కోట్లతో పరిశ్రమలని డ్రామా నడిపి... ఇప్పటికి కనీసం ఒక్క అప్పడం, తాండ్ర పరిశ్రమ రాలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల పరమేశు, శ్యాం, బసవయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక: కొట్టుపరువు పంచాయతీకి చెందిన పలువురు సోమవారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారికి ఆమె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులను, కార్యకర్తలను గౌరవించే పార్టీ టీడీపీయేనన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కలసి పని చేయాలన్నారు.


వైసీపీ వారికి టీడీపీ కండువా వేస్తున్న సంధ్యారాణి